విశ్రాంత ఉద్యోగస్తుల సంఘానికి
ఎమ్మెల్యే వేతనం అందజేత

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 24 : షాద్‌నగర్ నియోజకవర్గ విశ్రాంత ఉద్యోగస్తుల సంఘానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మొదటి నెల వేతనాన్ని అందజేశారు. సుమారు రూ.1.50లక్షల వేతనాన్ని శనివారం సంఘం నాయకులకు అందజేశారు. గతంలో విశ్రాంత ఉద్యోగస్తుల సమస్యలను తెలుసుకోవడంతో పాటు తన మొదటి నెల వేతనాన్ని అందజేస్తామని చెప్పడం జరిగిందన్నారు. విశ్రాంత ఉద్యోగస్తుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. విశ్రాంత ఉద్యోగస్తుల సంఘానికి మొదటి నెల వేతనాన్ని అందజేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు విశ్రాంత ఉద్యోగస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి సంఘం నాయకులు జగదీశ్వర్, రామారావు, జనార్దన్ పాల్గొన్నారు.

దత్తాత్రేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

షాబాద్, ఫిబ్రవరి 24: కర్ణాటక రాష్ట్రంలోని ఘనగాపూర్ దత్తాత్రేయ స్వామిని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య శనివారం దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు పోలీస్ రాంరెడ్డి, మల్లారెడ్డి, ప్రశాంత్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ తదితరులున్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

కమిషనర్ సత్యనారాయణరెడ్డి

తుర్కయాంజాల్, ఫిబ్రవరి 24 : మున్సిపాలిటీ ప్రజలు సకాలంలో పన్నులను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని తుర్కయాంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ సత్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మున్సిపాలిటీ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ పన్నులను వసూలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలంతా సకాలంలో పన్నులను చెల్లించాలని కోరారు. అదే విధంగా మున్సిపాలిటీ స్వచ్ఛత పౌరులందరి నైతిక బాధ్యత అన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, ఆర్ఐ నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలకు రోగనిరోధక టీకాలు వేయించాలి

కొత్తూరు, ఫిబ్రవరి 24: గొర్రెలకు దొబ్బరోగ నివారణ టీకాలు వేయించాలని కొత్తూరు వెటర్నరీ వైద్యురాలు స్ఫూర్తి అన్నారు. కొత్తూరు మండలంలోని తీగాపూర్‌లో శనివారం గొర్రెలకు ఆమె ఆధ్వర్యంలో దొబ్బ రోగ నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొర్రెలకు ఈ సీజన్‌లో దొబ్బరోగం రావడానికి అవకాశం ఉందని చెప్పారు. తీగాపూర్‌లో 500 గొర్రెలకు దొబ్బరోగ నివారణ టీకాలు వేశామని ఆమె వివరించారు. రాష్ట్రం ప్రభుత్వం ఈ టీకాలు ఉచితంగా వేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వెటర్నరీ సిబ్బంది శ్రీలత, రవి, గొర్రెల కాపరులు పాల్గొన్నారు.

గొర్రెలకు టీకాలు వేస్తున్న వెటర్నరీ వైద్యురాలు స్ఫూర్తి

గ్రామాల అభివృద్ధికి కృషి

మంచాల, ఫిబ్రవరి 24: గ్రామాల అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తాను ముందుకెళ్తానని ఎంపీపీ జాటోతు నర్మద అన్నారు. మంచాల మండలం ఎల్లమ్మ తండా గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.5లక్షల రూపాయలతో సీసీరోడ్డు పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం మండలం నుంచి అధిక నిధులు కేటాయించి అభివృద్ధికి బాటలు వేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

దీపం అంటుకొని ఇల్లు దగ్ధం

కాలిబూడిదైన నిత్యావసర వస్తువులు, బట్టలు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 24 : ఇంట్లో దీపం అంటుకొని ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మండల కేంద్రంలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ 138/4లో నివసిస్తున్న మాధవి (64) ఇంట్లో శనివారం దేవుడి వద్ద దీపం వెలిగించి పని నిమిత్తం బయటకు వెళ్లింది. దీపం కిందపడి చీరలకు అంటుకొని ఇల్లంతా మంటలు వ్యాపించాయి. మంటలు బయటకు ఎగిసిపడుతున్న విషయాన్ని స్థానికులు సురక్ష సేవా సంఘ ప్రతినిధులకు తెలిపారు. వారు వెంటనే స్పందించి హయత్‌నగర్ అగ్నిమాపక సిబ్బంది, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

అగ్ని ప్రమాద తీరును అడిగి తెలుసుకుంటున్న పోలీసులు

వైభవంగా కల్యాణ మహోత్సవం

వేణుగోపాల స్వామి, రుక్మిణీలకు పూజలు చేసిన భక్తులు

మంచాల, ఫిబ్రవరి 24: వేణుగోపాల స్వామి రుక్మిణీ కల్యాణం మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో వేణుగోపాల స్వామి జాతరలో భాగంగా శుక్రవారం రాత్రి దేవాలయ ఆవరణలో కల్యాణాన్ని నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ మహోత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్ : మండల కేంద్రంలో కొలువైన లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ఆలయంలో మహిళలు కుంకుమార్చన, సహస్రనామ పారాయణం, పూజలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, ఉత్సవ కమిటీ, ఆలయ కమిటీ చైర్మన్లు వేణుగోపాల్, ఆంజనేయులు, గౌడ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్, బ్రహ్మచారి, ప్రధాన పురోహితుడు వెంకటేశ్వరశర్మ, ఆలయ అనువంశీక అర్చకులు శ్రీధర్, శ్రీమన్నారాయణ, నర్సింహ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కన్నుల పండువగా శ్రీవారి రథోత్సవం

యాచారం : మండలంలోని తమ్మలోనిగూడ గేటు సమీపంలో కొలువుదీరిన శ్రీ వేంకటేశ్వరస్వామి జాతర అంగరంగ వైభవంగా కొనసాగుతున్నది. శనివారం తెల్లవారుజామున శ్రీనివాసుడి రథోత్సవం కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. గోదాదేవి, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామిని రథంపై ఊరేగించారు. గోవింద నామస్మరణంతో గుట్ట పరిసరాలు మార్మోగాయి. అనంతరం భక్తులు సామూహిక హోమాలను నిర్వహించారు. గుట్టపై బండచరియలో ఉన్న స్వయంభూతో పాటు ఆలయ గర్భాలయంలో కొలువుదీరిన మూలవిరాట్‌ను భక్తులు దర్శించుకొని పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక
సత్యనారాయణ వ్రతాలు

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 24 : శంకర్‌పల్లి మండలంలోని చందిప్ప గ్రామంలోని మరకత శివాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వందల సంఖ్యలో దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. సామూహిక వ్రతాలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం ఏర్పడింది.

పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఘనంగా నవగ్రహ పునఃప్రతిష్ఠాపన

పెద్దఅంబర్‌పేట, ఫిబ్రవరి 24 : మున్సిపాలిటీ తట్టిఅన్నారం పరిధి హనుమాన్‌నగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో నవగ్రహ పునః ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో సీతారామ ఆంజనేయ స్వామి ఆలయ అధ్యక్షుడు కే.విజయభాస్కర్‌రెడ్డి, నవగ్రహ పునఃప్రతిష్ఠ నిర్మాణ దాతలు మాధవరం సరిత, దేవేందర్‌రావు దంపతులు, కౌన్సిలర్ శ్రీధర్‌రెడ్డి, కమిటీ ప్రధాన కార్యదర్శి రమేశ్, కమిటీ ఇతర ప్రతినిధులు మురళీకృష్ణ, దేవేందర్‌రావు, అంజిరెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు విజయశేఖర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, దేవిడి వేణుగోపాల్‌రెడ్డి, మాధవరెడ్డి, కే సుదర్శన్, నల్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారుల కొరడా

ఆదిబట్ల, ఫిబ్రవరి 24: ఆదిబట్ల మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు దాడులు చేశారు. శనివారం ఉదయం మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మాణం చేపడుతున్న వాటిపై అధికారులు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు కోరే జంగయ్య మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు సిబ్బంది తెలిపారు. అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన బిల్డింగ్ యజమానులకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు.

నేడు జిల్లాస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

షాబాద్, ఫిబ్రవరి 24: నేడు షాబాద్‌లో జిల్లా స్థాయి క్రీడాపోటీలు ప్రారంభిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గూడూరు నర్సింగ్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దివంగత నేత పట్నం రాజేందర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా షాబాద్ మండల కేంద్రంలోని పీఆర్ఆర్ స్టేడియంలో నిర్వహించే జిల్లా స్థాయి క్రీడాపోటీలను ఆదివారం మధ్యాహ్నం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు తెలిపారు.

వ్యాసరచన పోటీలతో నైపుణ్యత వెలికితీయొచ్చు

చేవెళ్ల మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ టీనావతి

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 24: విద్యార్థులో దాగి ఉన్న నైపుణ్యతను వెలికి తీసేందుకు వ్యాసరచన పోటీలు ఎంతగానో ఉపయోగ పడుతాయని చేవెళ్ల మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ టీనావతి తెలిపారు. శనివారం చేవెళ్ల మండల కేంద్రంలోని మాడల్ స్కూల్‌లో చేవెళ్ల సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్టేట్ లెవెల్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... స్కూల్ లెవెల్‌లో టైం వేస్ట్ లైఫ్ వేస్ట్, కాలేజీ లెవెల్లో ప్లాంట్ ఏ ట్రీ బు మేక్ యువర్ ప్లానెట్ సేఫర్ అనే రెండు అంశాల పైన వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. దీంట్లో భాగంగా జిల్లా లెవెల్‌లో పదో తరగతి విద్యార్థి చైతన్య, ఇంటర్మీడియట్ విద్యార్థులు శృతి, సిరి చందన మొదటి బహుమతులు సాధించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవ సమితి సభ్యులు గోపాలచారి, కన్వీనర్ రామగౌడ్, సాయి సేవ సమితి బృందం, ఉపాధ్యాయులు ఉన్నారు.

పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కడ్తాల్, ఫిబ్రవరి 24: పంటల సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అధికారుల సూచనలు, సలహాలను పాటించాలని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీలత అన్నారు. శనివారం మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన వరి పంటలను ఏఈవో రమణతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటల సాగులో రైతులు అధికారుల సలహాలు, సూచనలను పాటించాలని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పంటలకు కాండం తొలుచు పురుగు, ఆకు పండు తెగులు సోకే అవకాశం మెండుగా ఉన్నదని పేర్కొన్నారు. పంటల సాగులో అధికారులు సూచించిన మేరకే రసాయన మందులు, ఎరువులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు కృష్ణాచారి, నర్సింహ, బ్రహ్మాచారి పాల్గొన్నారు.

చల్లంపల్లి గ్రామంలో వరి పంటను పరిశీలిస్తున్న ఏవో శ్రీలత

భక్తిశ్రద్ధలతో మహా పడిపూజ

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 24 : చేవెళ్ల మండల పరిధిలోని తంగడపల్లి గ్రామంలో శివ స్వాముల మహాపడి పూజ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో ఘనంగా చేశారు. శనివారం గ్రామంలోని శివాలయంలో స్వాములు ఏర్పాటు చేసిన శివస్వాముల పూజా కార్యక్రమాలకు మాలధారులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు. శబరీష భజన మండలి జంగిరెడ్డి శివప్ప భక్తిగీతాలు, ఆట, పాటలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈ కార్యక్రమంలో సురేశ్ గురు స్వామి, వీరభద్ర గురు స్వామి, గుండాల రాములు గురుస్వామి, అన్నదాతలు సత్తయ్యగౌడ్, రాములుగౌడ్, చంద్రయ్య గౌడ్, గోపాలురెడ్డి, జనార్దన్‌గౌడ్, శివదీక్ష సన్నిధానం స్వాములు, విష్ణువర్ధన్ రెడ్డి, నవీన్‌గౌడ్, బండ శేఖర్, పరమేశ్‌రెడ్డి, శేఖర్, కుమార్, ప్రకాశ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శ్రీకాంత్, ప్రభుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, చంద్రయ్య, పవన్, రమేశ్, సత్తయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహా పడిపూజలో పాల్గొన్న మాలధారులు

పన్నుల వసూలు త్వరగా పూర్తి చేయాలి

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 24 : గ్రామాల్లో ఇంటి పన్నులను త్వరితగతిన వసూలు చేయాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులతో వారాంతపు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక అధికారులు దృష్టి సారించాలి. గ్రామాల్లో శానిటైజేషన్ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని తెలిపారు. విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీవో గీత, సూపరింటెండెంట్ రవీందర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో వెంకయ్య

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

షాబాద్, ఫిబ్రవరి 24: షాబాద్ మండల కేంద్రంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాన ఆవరణలో ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు, ఎలుగంటి కవితమధుసూదన్‌రెడ్డి సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వివిధ గ్రామాలకు చెందిన 200 మందికి డాక్టర్లు ఉచితంగా కంటి చూపు, ఇతర పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎలుగంటి అభిరామ్‌రెడ్డి, శ్రీజిత్ రెడ్డి, తౌసిఫ్, శ్రీనివాస్, రఫీక్, దయాకర్, రిషబ్, ప్రభాకర్, ధీరజ్ తదితరులున్నారు.

సాంకేతిక రంగంలో వినూత్న పద్ధతులు అవలంబించాలి

మొయినాబాద్, ఫిబ్రవరి 24 : ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక రంగంలో వినూత్న పద్ధతులకు పదును పెట్టాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మాజీ డైరెక్టర్ హెచ్‌పీ సింగ్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ పరిశోధన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అవరోధాలను గుర్తించి వాటికి నిర్మాణాత్మకమైన పరిష్కారాలను చూపించడమే ఇంజినీరింగ్ విద్యార్థుల ముందున్న అతి పెద్ద బాధ్యత అని అన్నారు. ఇలాంటి సదస్సులు నిర్వహించడంతో విద్యార్థుల్లో ప్రతిభా నైపుణ్యాలు పెరుగుతాయని చెప్పారు. వివిధ కళాశాలలను నుంచి సుమారుగా 2 వందల పరిశోధనలకు సంబంధించిన అంశాలను విద్యార్థులకు అధ్యాపకులు సదస్సులో వివరించారు. కార్యక్రమంలో న్యూఢిల్లీ పంచాయతీ రాజ్ శాఖ కన్సల్టెంట్ ఎండీ ఖాన్, కళాశాల డైరెక్టర్ రోహిత్ కందకట్ల, ప్రిన్సిపాల్ సాయిసత్యనారాయణరెడ్డి, కన్వీనర్ ఎల్‌జే హరి, ఏవో రవికిరన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో ఘనంగా మైసమ్మ బోనాలు

చేవెళ్లరూరల్, ఫిబ్రవరి 24 : చేవెళ్ల మండల పరిధిలోని ఆలూర్ గ్రామంలో ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభమైన గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉత్సవాల్లో భాగంగా మైసమ్మ ఆలయంలో ఘనంగా పూజలు చేసి మహిళలు బోనాలతో ఊరేగింపుగా చేరుకొని నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయలక్ష్మీనర్సింహులు, ఉప సర్పంచ్, కురుమ సంఘం మండల అధ్యక్షుడు కసిరె వెంకటేశ్, ఎంపీటీసీలు యాదమ్మ, నరేందర్‌చారి, గ్రామస్తులు అనంతరాములు, యాదిరెడ్డి, రాజు, మల్లారెడ్డి, పాండు, జంగయ్య, సార యాదగిరి, నర్సింహులు, మోహన్, వెంకటేశ్, కె.నర్సింహులు, మల్లేశ్, అనంతయ్య, దేవయ్య, జంగయ్య, జె.నర్సింహులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్ కింద పడి వ్యక్తి మృతి

ఆదిబట్ల, పిబ్రవరి 24: ఆర్టీసీ బస్ చక్రాల కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం సాయంత్రం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం కుర్మేడ్ గ్రామానికి చెందిన నడిరి రమేశ్ (36) నగరంలోని పీవీటీ షాపులో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ప్రతి రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం తమ పని ముగించుకుని దేవరకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్‌లో తమ గ్రామానికి వెళ్తున్నాడు. బస్ ఫుట్‌బోర్డుపై నుంచి కాలు జారి కింద పడటంతో వెనుక చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వ్యభిచార గృహంపై ఎస్ఓటీ పోలీసుల దాడి

ఆదిబట్ల, ఫిబ్రవరి 24: వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ఇంటిపై ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం నాదర్‌గుల్ గ్రామంలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్ఓటీ పోలీసులు తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. అందులో వ్యభిచారం నిర్వహిస్తున్న ఒక మహిళతో పాటు మరో మహిళ, ఇద్దరు విటులను అరెస్ట్ చేశారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రణాళిక

మొయినాబాద్, ఫిబ్రవరి 24 : వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అధికారులు సమగ్ర యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలని ఎంపీపీ గునుగుర్తి నక్షత్రం అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మిషన్ భగీరథ నీటి సరఫరాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో సమగ్రంగా విచారణ చేపట్టి ఎక్కడెక్కడ తాగునీటి సమస్య ఉందని, ఏ గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీటి పైపు లైన్లు లేవు, నీటి సరఫరా సమస్యలు ఏమన్నా ఉన్నాయా..? అనే కోణంలో సమగ్రంగా విచారణ చేపట్టి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. సమస్యలేకుండా చూడాల్సిన బాధ్యత ప్రత్యేక అధికారులు, పంచాయతీ అధికారులదే అని పేర్కొన్నారు. మంచినీటి ఎద్దడిపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంధ్య, తహసీల్దార్ గౌతమ్‌కుమార్, గ్రామ అధికారులు, కార్యదర్శులు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

కడ్తాల్, ఫిబ్రవరి 24: ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి అన్నారు. తలకొండపల్లి మండల పరిధిలోని దేవుని పడకల్ గ్రామంలో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా, ఆలయ అభివృద్ధికి అంబటి రమేశ్ రూ.50 వేలను శనివారం ఆలయ నిర్వాహకులకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు పద్మనాభం, ఈవో ఆంజనేయులు, మాజీ సర్పంచ్ శ్రీశైలం, నాయకులు జంగయ్య, నర్సింహారెడ్డి, భిక్షపతి, మధు, బాలకృష్ణ, మల్లేశ్ పాల్గొన్నారు.